క్లుప్తంగా

ఘనంగా దత్తాత్రేయ జయంతి



ఉయ్యూరు: గండిగుంటలోని శ్రీ దత్తదేవాలయంలో మార్గశిర శుద్ధ పౌర్ణమి సందర్భంగా దత్తాత్రేయస్వామి జయంతి మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో విశేష పూజలు జరిపించారు. స్వామివారికి పంచామృత అభిషేకాలు, 108 కలశములతో అభిషేకం, అర్చన, దత్త హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మల్లవల్లి పారిశ్రామికవాడ పరిశీలన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడను ఆదివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ పరిశీలించారు. మల్లవల్లి పారిశ్రామికవాడ భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, గ్రామ సామాజిక అవసరాల భూకేటాయింపుపై ఇటీవల నెలకొన్న వివాదం గురించి ఆయన స్థానికులు, ప్రజాప్రతినిధుల నుంచి వివరాలు ఆరా తీశారు. మల్లవల్లి రీ సర్వే నంబర్ 11లోని 1,460 ఎకరాల రెవెన్యూ అటవీభూమిని 2016లో నాటి టీడీపీ ప్రభుత్వం పారిశ్రామిక అవసరాల నిమిత్తం సేకరించిందని, దీని కోసం ప్రత్యేకంగా జీవో నంబర్ 456 జారీ చేశారని పోతిన మహేష్‌కు స్థానికులు వివరించారు. గ్రామ సామాజిక అవసరాలు, ఇళ్ల స్థలాల పంపిణీ కోసం కేటాయించిన 100 ఎకరాల భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు తాజాగా యత్నిస్తోందని తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు కట్టు బోయిన రంగారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచేది చెస్



పటమట(విజయవాడతూర్పు): కఠినమైన శిక్షణ ఉంటే ఎలాంటి రంగంలోనైనా రాణించవచ్చని, విద్యార్థులకు వినోదంతో పాటు ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని పెంచే ఆటల్లో చదరంగం ప్రధానమైనదని కేఎస్ఆర్ చెస్ అకాడమీ అధినేత, ప్రముఖ చెస్ కోచ్ సురేష్ అన్నారు. కరెన్సీనగర్‌లోని అకాడమీలో ఇంటర్ స్కూల్స్ చెస్ చాంపియన్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. భారతీయ సంప్రదాయంలో ప్రాచీన ఆటల్లో చెస్ ప్రధానమైనదని, ఇద్దరి మధ్య జరిగే చెస్ పోటీలు వ్యక్తిలో ఏకాగ్రత, చురుకుదనం, వ్యూహం, ఎత్తులకు పైఎత్తులు వేయడంలో రాజసం ఉంటుందన్నారు. చెస్‌లో గెలవాలంటే లక్ష్యం, వ్యూహం ప్రణాళికబద్ధంగా ఉండాలని ఇది నిజ జీవితంలో కూడా గెలిచేందుకు దోహదపడుతుందని చెప్పారు. ఈ పోటీల్లో 6.5 పాయింట్లతో ఈశ్వర్ మొదటి స్థానం, వి. భువనేశ్వర్ ద్వితీయ స్థానం పొందారు. ఆరు పాయింట్లతో సాయి అమిత్ తృతీయ స్థానంలో నిలిచారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పోటీల్లో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథలకు దుప్పట్ల పంపిణీ

పెనమలూరు: యనమలకుదురుకు చెందిన మెండం హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో రోడ్డు పక్కన జీవించే అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. యనమలకుదురు, విజయవాడ పరిసర ప్రాంతంలో మెండం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శనివారం రాత్రి పర్యటించారు. రోడ్డు పక్కనే చలిలో ఉంటున్న వారిని గుర్తించి వారికి దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మెండం హెల్పింగ్ హ్యాండ్స్ నిర్వాహకురాలు వీరంకి కీర్తి మాట్లాడుతూ అనాథలు చలిలో ఇబ్బందులు పడకుండా ఉండటానికి దుప్పట్లు, రగ్గులు అందజేశామన్నారు. భవిష్యత్తులో తమ సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తుందని పేర్కొన్నారు.

మహిళకు గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రెండు ఆటోలు ఢీకొనడంతో ఓ మహిళకు గాయాలైన ఘటన భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. విద్యాధరపురం ఆర్టీసీ వర్క్ షాపునకు చెందిన జె.లక్ష్మీవాసంతి గొల్లపూడిలోని ఓ దుకాణానికి వెళ్లింది. అక్కడ సరుకులు కొనుగోలు చేసి ఆటోలో తిరిగి వస్తుండగా ఫ్లైఓవర్ సమీపంలో రాంగ్‌రూట్‌లో వస్తున్న ట్రక్ ఆటో ఆమె ప్రయాణిస్తున్న ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో లక్ష్మీవాసంతి ముఖం, తల, కుడి చేతికి గాయాలయ్యాయి. ఆమెను 108వాహనంలోని భవానీపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు

- తెంపల్లె రోడ్డు మార్గంలో హెచ్చరిక బోర్డులు కూడా లేవు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు, వాహనదారులు
- ఆర్‌అండ్‌బీ అధికారుల చర్యలు శూన్యం



పెద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద ప్రమాదకర మలుపు

గన్నవరం రూరల్: మండలంలోని తెంపల్లె రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. పెద అవుటపల్లి వద్ద జాతీయ రహదారి నుంచి తెంపల్లె వరకూ ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి అనేక మలుపులతో కూడి ఉంది. ఈ రోడ్డు మార్గంలో తెంపల్లె, బల్లిపర్రు, వీరపనేనిగూడెం, మెట్లపల్లి, సగ్గూరు గ్రామాల ప్రజలతో పాటు విద్యార్థులు నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. అలాగే చిన అవుటపల్లి పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న పరిశ్రమల్లోనూ, వీరపనేనిగూడెం ఏపీఐఐసీలో ఉన్న పరిశ్రమల్లో పని చేసే వందలాది మంది కార్మికులు నిరంతరం ఈ రోడ్డు మార్గంలో రాకపోకలు కొనసాగిస్తుంటారు. అంతేకాకుండా వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రయివేటు పాఠశాలల బస్సులు నిరంతరం తిరుగుతుంటాయి. పెద అవుటపల్లి రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద నిత్యం ట్రాఫిక్ రద్దీ కొనసాగుతుంది.

తరచూ ప్రమాదాలు

నిత్యం ఎంతో ట్రాఫిక్ ఉన్న ఈ రోడ్డు మార్గంలో కనీసం పది చోట్ల ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. ఈ మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎన్ని ప్రమాదాలు జరిగినా ఆర్‌అండ్‌బీ అధికారులకు చీమకుట్టినట్లు అయినా లేదు. కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా చేయలేదు. ఎన్నోసార్లు అధికారులకు ఈ ప్రాంత ప్రజలు వినతులు అందజేశారు. అయినా చర్యలు శూన్యం.

అడుగడుగునా గండమే

పెద అవుటపల్లి జాతీయ రహదారి దాటి ముందుకు రాగానే చెత్త నిల్వలు ఉన్నాయి. వాటికి నిప్పు పెట్టడంతో పొగ ఆ ప్రాంతాన్ని కమ్మేస్తోంది. పొగలో నుంచి బయటపడి రైల్వే లెవెల్ క్రాసింగ్ మలుపునకు చేరుకునే క్రమంలో ఉన్న మలుపు ప్రమాదాలకు నెలవు. క్రాసింగ్ దాటిన తర్వాత హేచరీ వైపునకు తిరిగే మలుపు మరింత ప్రమాదకరంగా ఉంది. అది దాటి ముందుకు వెళ్లిన తర్వాత టవల్స్ కంపెనీ వద్ద మరో మలుపు ప్రమాదాలకు పిలుపుగా ఉంది. అదే ప్రదేశంలో మూడు మలుపులు కూడి ఉండటంతో ఈ ప్రాంతంలో ప్రయాణించే వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. ఇటువంటి మలుపులు మరో పది వరకూ ఉన్నాయి. ఈ రోడ్డు వెంట జంగిల్ పెరిగితే ప్రమాదాలు మరింత ఎక్కువగా ఉండటం జరుగుతోంది.



టవల్స్ కంపెనీ వద్ద ప్రమాదకరంగా మలుపులు



లెవెల్ క్రాసింగ్ దాటిన తర్వాత హేచరీ వైపు ఉన్న మలుపు

ప్రమాదాల నుంచి కాపాడండి



తెంపల్లె రోడ్డు మార్గంలో ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలి. తరచూ ఈ మలుపుల వద్ద ద్విచక్ర వాహనాలు ఢీకొని గాయాలపాలు అవుతున్నారు. ఈ ప్రమాదాల నుంచి కాపాడాలి.

– పి.వెంకట రమణ, తెంపల్లె

హెచ్చరిక బోర్డులు పెట్టాలి



ఈ రోడ్డు చాలా రద్దీగా ఉంటుంది. ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు నిరంతరం రాకపోకలు కొనసాగిస్తున్నారు. వారి సౌకర్యం కోసం చర్యలు తీసుకోవాలి. మలుపులను గమనించే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాలి.

– ఆవల వెంకన్న, తెంపల్లె

ప్రమాదాలతో ఇబ్బందులు



రోజూ జరిగే ప్రమాదాలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఆ కుటుంబాలు నష్టపోతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలు నివారించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలి.

– మస్తాన్ ఖాన్, తెంపల్లె

ఆదర్శప్రాయుడు అమరజీవి



నున్నలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులు



గన్నవరంలో పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ సిబ్బంది



యనమలకుదురులో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ సభ్యులు



ప్రసాదంపాడులో అమరజీవి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

పొట్టిశ్రీరాములుకు ఘన నివాళి

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఆదివారం అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి ఇన్‌చార్జ్ గ్రంథాలయాధికారిణి పీడీ లక్ష్మి, పలువురు సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం కోసం ఆయన చేసిన త్యాగాన్ని విశ్రాంత ఉద్యోగి కంభంపాటి ధర్మారావు విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ సిబ్బంది కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు: పెనమలూరు మండలంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి చేశారు. యనమలకుదురు గ్రామంలో ఎన్టీఆర్ బస్టాండ్ వద్ద మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు బుద్దా లక్ష్మణకుమార్, సభ్యులు తటపర్తి సతీష్, కొండవేటి బాబూరావు, నాళ్ల శ్రీనివాసరావు, చిట్టూరి శ్రీనివాసులు, కృష్ణారావు పాల్గొన్నారు.

కానూరులో..

కానూరులో మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవా సంఘ్ ఆధ్వర్యాన అశోక్ జిమ్‌లో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్, బాడీ బిల్డింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం జరిగింది. సంఘ సభ్యులు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు ముప్పిడి భాస్కరరావు(స్వామి), జూలూరు వెంకట శ్రీధరరావు, చిన్ని వెంకటేశ్వరరావు, ధారా ప్రభాకరరావు, సంకా విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

రామవరప్పాడు: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ అధ్యక్షుడు గుండు దిలీప్ అన్నారు. విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులో ది కిరాణా మర్చంట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జూలూరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దిలీప్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేశారని కొనియాడారు. అనంతరం బాటసారులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉడత్తు ఆంజనేయులు, ఉరిమి సుబ్రహ్మణ్యం, ఉడత్తు హరీష్, కందెపు ఆనందరావు, మాదాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే దేశ సంపద

కలెక్టర్ డీకే బాలాజీ



కలెక్టర్ బాలాజీని సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం

పెనమలూరు: దేశం అభివృద్ధి చెందాలంటే విద్య చాలా అవసరమని, నేటి విద్యార్థులే దేశ సంపదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. కానూరులో ఆదివారం షామ్‌రాక్ ఇంటర్నేషనల్ స్కూల్ 4వ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశ భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధారపడి ఉందన్నారు. ప్రతి విద్యార్థీ క్రమశిక్షణతో చదవాలని సూచించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను మంచి మార్గంలో పయనించే విధంగా కృషి చేయాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల చేతిలోనే ఉంటుందని తెలిపారు. పాఠశాల చైర్మన్, డైరెక్టర్ టి.సుమన్‌త్యాగరాజ్, మోనికా సుమన్ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి బంగారు పతకాలు సాధించారని చెప్పారు. ఆటల పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో 13 మంది విద్యార్థులు పతకాలు గెలిచారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేసి ఆకట్టుకున్నారు. ఓక్‌రిడ్జ్ పాఠశాల డైరెక్టర్ మండవ ప్రసన్న, ప్రిన్సిపాల్ డాక్టర్ భారతిధర్, విద్యార్థుల తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పచ్చనేతల ఆక్రమణలకు అంతేలేదు



తాడిగడప జంక్షన్‌లో రాత్రికిరాత్రే రోడ్డుపై పెట్టిన బడ్డీ కొట్టు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పచ్చనేతల ఆక్రమణలకు అంతే లేకుండా పోయింది. యనమలకుదురు కొండ వెనుక విలువైన ప్రభుత్వ స్థలం ఆక్రమణల పరంపరలపై వివాదం ఉండగా తాజాగా తాడిగడప జంక్షన్‌లో రోడ్డుపై బడ్డీకొట్టు రాత్రికి రాత్రే ప్రత్యక్షమైంది. వివరాల్లోకి వెళితే.. తాడిగడప వంతెన ప్రాంతంలో చిరు వ్యాపారుల ఆక్రమణలు ఉన్నాయని ఇటీవల వాటిని తొలగించి టీడీపీ నేతలు వారి పొట్ట కొట్టారు. అయితే తాజాగా శనివారం ఉదయం కల్లా బడ్డీ కొట్టు కొత్తగా ప్రత్యక్షమైంది. ఏకంగా రోడ్డును ఆక్రమించి బస్‌స్టాప్ పక్కనే బడ్డీ కొట్టు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ప్రైవేటు రైతుబజార్ ఏర్పాటుతో జాతీయ రహదారిపై వాహనాలు పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. పచ్చపాలకుల తీరు ఇలాగే ఉంటే భవిష్యత్తులో విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారి పూర్తిగా ఆక్రమలకు గురయ్యే ప్రమాదం ఉంది. కాగా రోడ్డు ఆక్రమణపై సీపీఎం నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ నేతలు తమ వ్యవహారశైలి మార్చుకోవాలని సూచిస్తున్నారు. ఈ విషయమై కమిషనర్ భవానీప్రసాద్‌ను వివరణ కోరగా ఆక్రమణ తన దృష్టికి రాలేదని చర్యలు తీసుకుంటానని తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం పలువురు కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆరాధ్య అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్‌కు చెందిన యేలేశ్వరపు ఉషామాధురి ఆధ్వర్యంలో భక్తి సంగీతాన్ని ఆలపించారు. సోమయాజులు ఉషామాధురి, సాయికీర్తన, కామాక్షి కాశ్యపి, రేయ నూతక్కి, కీర్తి కౌముది, సహస్ర శ్రీహిత పండరి, కాశీ విశ్వనాథ్, నాగ శ్రీశ్రావ్య పలు కీర్తనలను ఆలపించారు. వీరికి మృదంగంపై కిశోర్, వయోలిన్‌పై శ్రీకృష్ణ చక్కటి సహకారం అందించారు. అనంతరం కళా బృందానికి ఆలయ ఈఓ కెఎస్.రామారావు దంపతులు అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

దిగుబడులపై గంపెడాశ

- మినుము తీతలకు సిద్ధమవుతున్న రైతులు
- చేతికొస్తున్న పంట



ఈడుపుగల్లులో తీతకు సిద్ధంగా ఉన్న మినుము పంట

కంకిపాడు: మినుము పంట తీతకు సిద్ధమైంది. పంట చేతికి వచ్చే సమయం ఆసన్నం కావడంతో రైతులు తీత పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. దిగుబడులపై గంపెడాశలు పెట్టుకున్నారు.

పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మెట్ట ప్రాంతం భూముల్లో రైతులు మినుము సాగు చేశారు. దీనితో పాటుగా సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు, కృష్ణానదికి పోటెత్తిన భారీ వరదల కారణంగా పంటలు దెబ్బతినడంతో రైతులు ఖరీఫ్‌లోనే మినుము సాగు చేపట్టారు. నియోజకవర్గం వ్యాప్తంగా 300 ఎకరాల్లో మినుము సాగు చేసినట్లు అంచనా. ప్రస్తుతం మినుము పంట చేతికొచ్చింది. తీతకు సిద్ధం కావడంతో రైతాంగం తీత పనులపై దృష్టి సారించారు.

తెగుళ్లు.. పురుగుల బెడద

ఈ ఖరీఫ్ సీజన్‌లో మినుము పంటను తెగుళ్ల, పురుగుల బెడద పట్టి పీడించింది. ప్రధానంగా పొగాకు లద్దె పురుగు, పల్లాకు తెగుళ్ల పంటను ఆశించాయి. వాతావరణంలో తేమ అధికంగా నమోదు కావడం, అడపాదడపా కురిసిన వర్షాలకు పురుగు ఉధృతి అధికంగా ఉంది. పూత, పిందె దశలో పంటను ఆశించి నష్టం కలిగించాయి. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి నేతృత్వంలో శాస్త్రవేత్తల బృందం అధికారులతో కలిసి పలు గ్రామాల్లో పర్యటించి పురుగు ఉధృతిని గుర్తించి యాజమాన్య చర్యలను సూచించారు. అధికారులు, శాస్త్రవేత్తల సూచనలతో రైతాంగం సస్యరక్షణ చర్యలు చేపట్టారు.

ఈ దఫా ప్రతికూల వాతావరణం

పంట దిగుబడులపై రైతులు ఆశతో ఉన్నారు. గత సీజన్‌లో రబీలో ఎకరాకు ఎనిమిది నుంచి 10 క్వింటాళ్ల వరకూ దిగుబడులు లభించాయి. క్వింటా ఒక్కింటికి రూ. 10 వేలకు పైగా ధర పలికింది. ఈ దఫా వాతావరణ పరిస్థితులు స్వల్పంగా ప్రతికూలించాయి. పొగాకు లద్దె పురుగు ఉధృతి కూడా ఆందోళన కలిగించింది. ఈ దశలో పంట చేతికొస్తుంది. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తే గట్టెక్కిపోతామంటూ రైతాంగం గంపెడాశతో ఉన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి నుంచి బయటకు వెళ్లిన తనభర్త 20రోజులుగా కనిపించడం లేదంటూ ఓ వివాహిత ఫిర్యాదు చేయడంతో కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు..కొత్తపేట గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన దుర్గాసీ పురుషోత్తం, దుర్గాలావణ్య భార్యాభర్తలు. వీరికి 15ఏళ్ల కిందట వివాహం కాగా ఇద్దరు సంతానం. కుమారుడు హర్షవర్ధన్ రెండు నెలల కిందట మంచినీటికి బదులుగా యాసిడ్ తాగడంతో చికిత్స చేయిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు అధికం కావడంతో కొద్ది రోజుల కిందట పురుషోత్తం ఇంటినుంచి వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. 20రోజులు అవుతున్నా భర్త జాడ లేకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

నేడు కందలంపాడులో రెవెన్యూ సదస్సు

కంకిపాడు: మండలంలోని కందలంపాడు గ్రామంలో ఈనెల 16వ తేదీ సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. సదస్సుకు తహసీల్దార్ వి.భావనారాయణ హాజరవుతారన్నారు. గ్రామంలోని ప్రజలు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకుని, భూ సంబంధ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంకిపాడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వి.భావనారాయణ కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 16వ తేదీ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు మీకోసంలో పాల్గొంటారన్నారు. ప్రజలు తామెదుర్కొంటున్న సమస్యలపై అర్జీలను సమర్పించి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

రేపు పెన్షనర్స్ దినోత్సవ వార్షిక సభ

గన్నవరం: స్థానిక విశ్రాంత ఉద్యోగుల సేవా భవన్‌లో ఈ నెల 17వ తేది మంగళవారం ఉదయం 10 గంటలకు పెన్షనర్స్ దినోత్సవ వార్షిక సభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గన్నవరం యూనిట్ అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో ఏపీజేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీఎస్‌జీఆర్‌ఈ అసోసియేషన్ విజయవాడ కార్యదర్శులు లోవకుమార్, ఎస్. నారాయణరావు, గన్నవరం సబ్‌ట్రెజరీ అధికారి టి. నాగరాజు పాల్గొంటారని పేర్కొన్నారు. సభ అనంతరం 75 ఏళ్లు పైబడిన పెన్షనర్లను సత్కరించనున్నట్లు తెలిపారు. గన్నవరం యూనిట్ పరిధిలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లందరూ హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

బైక్ చోరీపై కేసు నమోదు

పెనమలూరు: పెదపులిపాకలో బైక్ చోరీ ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక శివాలయం సమీపంలో ప్రభుత్వ ఉద్యోగి ఎ.సుజాత కుటుంబ సభ్యులతో ఉంటుంది. ఆమె తన బైక్‌ను ఇంటి ముందు పార్కు చేసింది. అయితే గుర్తు తెలియని వ్యక్తులు బైక్ చోరీ చేశారు. బైక్ కోసం ఆమె వెతికినా జాడ తెలియలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

శృతిలయ సమ్మేళనం రామమూర్తి గాత్రం



విజయవాడకల్చరల్: శ్రీ సుబ్రహ్మణ్య మహతీ కళాపీఠం ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా దుర్గాపురంలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం ఎన్.రామమూర్తి నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరీ వాగ్గేయకారులకు సంకీర్తనా గుడికట్టింది. సంగీత త్రిమూర్తులు ముత్తుస్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలను మధురంగా ఆలపించారు. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై కొమ్మ్మా జొన్నల సద్గురు చరణ్ వాద్య సహకారం అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్ సంగీత కచేరీ నిర్వహించిన రామమూర్తి సంగీత సేవలను వివరిస్తూ వృత్తిరీత్యా చార్టర్ అకౌంటెంట్ అని, చిన్నతనం నుంచే సంగీతంలో శిక్షణ తీసుకున్నారన్నారు. దేశ విదేశాల్లో కచేరీలు నిర్వహించారని తెలిపారు. సంస్థ కార్యదర్శి సీవీ రావ్ సంస్థ లక్ష్యాలను వివరించారు. సంగీత విద్వాంసుడు రామమూర్తిని ఆత్మీయంగా సత్కరించారు.